# సువర్ణ చాలా మిశ్రమం

కొంతపాత్ర సామానువెళ్ళగా జబ్బు నుంచి బయటపడిన సరోజిని ఓ ఆదివారం మధ్యాహ్నం, పోగామిగిలిన కేశ సంపదని అద్దంలో చూసుకుంటోంది. అక్కడే చాపమీద పడుక్కున్న భర్త చూపులో 'జుత్తులో, నీ అందమే పోయింది సుమా!' అన్నభావం పొడగట్టినట్టు ఊహించుకుంది ఆమె. అతని ధ్యానం మళ్ళించాలని 'అదేవిటో గుంటలిద్దరికీ విరోచనాలు సరిగా అవడం లేదండీ. రాజులుగారి నడిగి ఏదైనా అరకు తెద్దురూ' అంది.

'ఊఁ' అన్నాడు పరాకుగా చంద్రయ్య.

'ఊ అంటే కాదు. పాపకి అజీర్తిముదిరేలా గుంది. పెద్దవాడు కడుపునొప్పి అని ఒకటే గోల'.

'అలాగేలే'

'మందుకి కూడా నేను పరుగెత్తితే బాగుండదు. మీరు చెప్తే కాస్త శ్రద్ధగా వింటాడాడాక్టరు.'

భార్య అన్నమాటల్లో మెుగపనులు కూడా




తానే చెయ్యవలసి వచ్చిందన్న ఫిర్యాదు తోచి చంద్రయ్యవెళతాన్లే అదేపోదా' అని కసురుకున్నాడు.

ఫిజిక్స్ లేబరేటరీలో అటెండర్ పనీ, పిల్లలతో ఆడుకోవడమూ తప్ప వేరే బాధ్యత ఎరగడు చంద్రయ్య. కూరా నారానుంచి మెుగుడికి బేస్తదాకా సరోజినే చూసుకుంటుంది. చంద్రయ్య చంద్రుడిలా కులాసా పురుషుడు. ఆషాఢాకాశంలాటి జీవితం అతని నవ్వుమెుగాన్ని ఏదో విచార మేఘంతో కప్పజూస్తుంది. అయితే అతని ధైర్యోత్సాహాలు మారుతంలాటివి.

భర్త విసుక్కోడని సరోజిని బాగా

## రుద్రాభట్ల నరసింగరావు

ఎరుగును. విసుక్కుంటే మట్టుకు అతనికెదో జెంగ ఉన్నట్టే లెక్క.

జుత్తుచిక్కు తీస్తూ 'ఈ పళ్ళులేని పన్నికి జుత్తులేని నాజాకీ సరిపోయిందంతే. ఉన్నది కూడా తెగ ఊడిపోతుంది. మళ్ళీ జుత్తు రావడానికేదైనా నూనె లేదుటండీ?' అంది మెుగుడు మాట్లాడకపోయే సరికి సరోజినే అంది: 'సుందరమ్మగారు కొందండీ—అంటే వాళ్ళ ఆయనే తెచ్చారుట లెండి; అందరికీ నాలా బజారు సామాన్లు కూడా తెచ్చుకోవలసిన కర్మమేం?—అదేవిటమ్మ దానిపేరు, ఆఁ...బ్రాహ్మీ ఆయిల్లు.'

ఏదో ఆలోచన తట్టగా తటాలున లేచి 'బ్రాహ్మీ అంటే సరస్వతే కదుటోయ్?' అని అరిచాడు చంద్రయ్య.

'ఏమో నాకేం తెలుసునండీ'

'అవును పాపం నీకెలా తెలుస్తుందిలే, కాని ఇదిగో విను

"బ్రాహ్మీ సరస్వతీ భారతీ......"అని అమరకోశుడు చెప్పాడు.

ఇంతలోనే భర్త మళ్ళీ హుషారుగా ఉన్నందుకు సంతోషించింది సరోజిని. 'ఎప్పుడూ గంథోళిగాడిలా వుండే తమరు ఇంతసేపూ బెల్లం కొట్టిన రాయిలా కూర్చుండి పోయారేవండి?' అని నవ్వుతూ అడిగింది.

'దిగులుతో నీ గుండెలో గుబులుగా ఉందని ఎరుగవో అబలా?'

'ఎందుకో దిగులు?'

'వీడు ఆడుతూ పాడుతూ పనిచేస్తాడని తెలుసుగదా? ఆ మన అప్రమత్తత—అజాగ్రత్త అనడానికి ప్రమత్తత అని కాబోలు అనాలి...తెలుగు మేష్టరి కానాడు సమర్పించుకున్న మామిడిపండ్ల బుట్ట మార్కులనే గాని మాటలనివ్వలేక పోయింది—సరే అది ప్రస్తుతం—ఊహుఁ...అప్రస్తుతం. చెప్పొచ్చేదేమిటంటే లేబరెటరీలో రెండు వందల రూపాయలు ఖరీదుచేసే సామానుపోయింది.'

'అయ్యో నిజంగానే?'

'ఆహా, అందుకని మన జీతంలో నెల నెలా పాతికకోత'

'అయ్యో అయ్యో చావు కబురు చల్లగా చెప్పేరే...'

'ఓహో నీకూ నా మాటల ధోరణి పట్టుబడుతోందే! ఆరునెలు సావాసం చేస్తే...'

'చాలెండి! లేపణ్ణుంచి పిల్లలకేం పెట్టడం! మనముద్ద ఎలా ముక్కలు చేసుకోవడం? తెల్లారితే అప్పులాళ్లు పీకలమీద సవారీ అవుతారే! ఇంత పూచీ పే చీ లేని వాళ్ళు దొరికారేం ఖర్మండీ! రెండువందలు గంగపాలయితే చీకు చుట్టినట్టయినా లేదే మీకు!...' అని సరోజిని గోల చేయ సాగింది.

'చీకు చుట్టినట్టు ఎందుకుండాలి భామా! వామ చేత్తో కూడదీస్తాను నష్టాన్ని.' అంటూ వెళ్లిపోయాడు చంద్రయ్య.

ఏ నవరాత్రుల్లోనయినా భర్తకి బేరం తగిలిందేమో అని ఆశపడింది సరోజిని. చంద్రయ్య మద్దెల వాయిస్తాడు. స్టేజీ ఎక్కి హరికథో గిరికథో ప్రజలేది చెప్పమంటే అదే చెప్పేస్తాడు. ఆశుకవి. అనేక వేషాలు వెయ్యడంలో నేర్పరి. కాని కలిగిన నష్టానికి ఆమె ప్రాణం పుసూరుమనడం మానలేదు. తలనూనెకిగాని, పిల్లలకి మందిప్పించుకోవడానికి గాని దమ్మిడీలేని పరిస్థితిలో ఇలాటి దండుగలుకూడా ఏమిటి దేవుడా అని వాపోతోంది.

ఆ సాయంత్రం బోలెడు ఖాళీ ఆముదం సీసాలూ, సిగరెట్ల డబ్బాలూ తెచ్చాడు చంద్రయ్య. రెండు రోజులు పిల్లల్ని వొంటింట్లోనే పడుకోమని చెప్పి గదిలో అవన్నీ దాచి తాళంవేశాడు. మరునాడు పొద్దున్నే పక్కయింటతని సైకిలు మీద ఎక్కడికో వెళ్ళి పెద్ద సంచిలో ఏదో

ఆటూ, వాయూ, పెద్ద గొల్లపచ్చూ తెచ్చాడు.

భర్త స్వయంగా ఇన్ని సరుకులు తేవడం చూసి ఇక తన కాపురం మూడు పువ్వులూ ఆరు కాయలుగా వుండబోతోంది కాబోలు అని సంబరంతో ఎదురు వెళ్ళింది సరోజిని.

'ఇవి నలువరాణి పత్రాదులు కలువగంటే, ఇంటికోసం కాదుసుమా,' అంటూ చంద్రయ్య గదిలోనికి వెళ్ళి పోయాడు.

గదిలోనుంచి అప్పుడప్పుడు యివతలికి వచ్చేవాడు చంద్రయ్య. ఏవో హుకుంలు జారీ చేసేవాడు. భర్తప్లాను ఏమిటో తెలియకపోయినా నష్టం మాత్రం లేదనే నమ్మకంతోవున్న సరోజిని, విసుగుకున్నా, అతను కావాలన్నవి—కల్వం, అమాన్ దస్తా, డేగిశా. నూనెవగైరాలు—ఎక్కడో అక్కడ సంపాదించి అందించేది.

ఓ మందులకంపెనీకి తానేదో తయారు చేస్తున్నానని మాత్రమే చెప్పాడు భర్త. వాళ్ళు ముట్టజెప్పే ద్రవ్యంలోనిదే తనకో నవరం, వీలయితే కేశవర్ధనీ, పిల్లలకి విరోచనాల మాత్రలూ కొనమని పురమాయించింది సరోజిని.

రెండురోజులపాటు చంద్రయ్య నూరడం, వండడం, అచ్చువేయించిన చీటీలు సీసాలకీ డబ్బాలకీ అంటించడం—ఈ పనులలో మునిగి పోయాడు. తర్వాత వీటన్నిటినీ స్నేహితుడిదగ్గర ఎరువు తెచ్చిన సూట్ కేస్‌లో చక్కగా అమర్చుకుని వెళ్ళి పోయాడు.

'ఏమండీ కొంపలంటుకు పోతున్నట్టు అర్థరాత్రి వెళ్ళొచ్చారు? డబ్బిచ్చేశారా?' అనడిగింది సరోజిని.

'అప్పుడే?'

మరునాటినుంచి చంద్రయ్య మామూలుగా కాలేజికని బయలుదేరుతున్నాడు. మునపటిలాగాక, బాగా చీకటిపడ్డాక వొస్తున్నాడు. ఆ డబ్బుమాట చెప్పడు.

సరోజిని నిరాశపడి ఊరుకుంది.

భర్త భోంచేసి వెళ్ళాక పిల్లల్ని పొరుగింటావిడ ఖాయిదాలోఉంచి బజారుకి వెళ్ళడం సరోజిని అలవాటు.

ఇవ్వాళ బయలుదేరుతూ 'పిల్లలకి అజీర్తి ఎక్కువయి పోయింది పిన్నిగారూ; ఎలాగో ఏవిటో తోచడంలేదు.' అంది సుబ్బమ్మగారేమైనా నాటుక్కంలో మోతుం చూపిస్తుందేమోనన్న ఆశతో.

'దీనికంత బెంగెందుకమ్మాయి!' కాస్త వాము లేహ్యం చెయ్యి. అంతఓపిక లేకపోతే గంటస్తంభం దగ్గర ఓ ఆయుర్వేద మందులమ్మే అతనున్నాడుట—ఎర్రపాగా, నల్లకళ్ళజోడూ, రూపాయంత కుంకం బొట్టూ అతనూ—మా ఆయన అతనిదగ్గరే కొన్నారుట

(41-వ పేజీ చూడండి)



# సువర్ణచాలా మిశ్రమం

(25-వ పేజీ తరువాయి)

"సువర్ణ చాలా మిశ్రమం" అని ఓ లేహ్యం ఆయనకి అజీర్తి కదుటమ్మా..." అంటూ ఓడబ్బా తీసుకొచ్చి చూపించిం దావిడ.

బజార్లో ఆ మందులమ్మే అతన్ని కనుక్కోవడం సరోజినికి కష్టం కాలేదు. పట్నంలోకల్లా రద్దీ అయిన స్థలమేమో అతనికి బాగా బేరం తగిలినట్టుంది. చుట్టూ మూగిన ప్రజకి ఉపన్యసిస్తున్నాడు.

'.. అయ్యా దీని ప్రధానగుణం మలబద్ధాన్ని మాయం చెయ్యడమండి. కడుపు నొప్పి ఉంటుంది; దీన్ని తింటే మరి కనిపించదండి. రాత్రులందు నిద్రఉండదు; ఇలాటి చెంచా ఒకటి పుచ్చుకుని యీ మాత్రం సేవించండి...'

'దీని పేరండీ?'

'చెప్తున్నానండి...అలా సేవిస్తే కొట్టేసినట్టు కమ్మని నిద్రపడుతుందండి. ఇంకా దీనిగుణాలు వివరంగా ఆ పేపర్లోఉన్నాయి. దీని పేరు సువర్ణ చాలా మిశ్రమమండి, బంగారమేగాక యిందులో ఇంకా చాలా చాలా కలిసివున్నందువల్ల ...'

'అరరె! వైరి సమాసంచేశారే,' అని గుంపులో ఎవరో నవ్వారు.

మందులతను నవ్వుతూ 'అయ్యా మేం అజాతశత్రువులమండి. మాకు సమాసాలతో నయినా వైరం లేదు. అదీ గాక—చతుర కవిరాజ బిరుదాంకిత చరక విరచిత సువర్ణాది మిశ్రమములనే గ్రంథంలో దీనిపేరు గూర్చి విశదంగా ఉందండి.. దీన్ని పెద్దవారూ పిల్లలూ కూడా వాడవచ్చును. పథ్యంలేదు. కావలసినవారు త్వరపడండి. కొద్ది డబ్బాలే ఉన్నాయి.దీని ఖరీదు ఒక్క రూపాయి మాత్రం. మీ పిల్లలకి బిస్కెట్ల పొట్లం కొన్నపాటిలేదండి వారం రోజు లుంటాం. గుణం కనబడకపోతే డబ్బు వాపసుఇస్తాం.'

ప్రజలు కొంచెం ముంగుకు వచ్చారు.

అతను ఇంకొకటి తీసి చెప్ప సాగాడు: 'ఆయ్యా ఇది పరికించండి "భారతీ కచభార వర్ధకామృత"మని దీనిపేరు. జబ్బు చేసిగాని మరోలాగాని శిరోజాలు తరిగి పోతాయి చూడండి. అలాటివారు అరచేతిలో ఆ మాత్రం నూనె వేసుగుని ప్రతిరోజూ తలకి మర్దనా చేసుగుంటే శరవేగంగా శిరోజాలెదుగుతాయి. జడవేసుగుంటే త్రాచు గొడ్డులా...'

'ఘోరం గురో! నడిరోడ్డుమీద ఆడదాని హత్య! కవితా కన్యకఖూనీ!' అని గుంపులో నవ్వులు:

'అయ్యా కొత్త ఉపమానాన్ని సృష్టించడం అపచారం అయితే "తాచులా" అనే చెప్పుకుందాం. ఈ తైలం ఖరీదు సీసా ఒక్కంటికి రెండు రూపాయిలు. మూడు బుడ్లు ఒకేసారి తీసుకున్నవారికి మొత్తం మీద ఒకరూపాయి తగ్గిస్తాం.'

పిల్లలకోసం లేహ్యం కొనాలని దూరంగా నిల్చున్నదల్లా అతని తియ్యని కబుర్లువిని తనకి ఓ నూనెసీసాకూడా కొనుక్కుంటే బాగుండు ననిపించింది. అవును మరి, సరోజినికి జుత్తు ఊడిపోయిన దగ్గర నుంచి తల కొట్టేసినట్టుగా ఉంది. పిల్లల ఆరోగ్యం ఎంతో, తన అందమూ అంతే ఆ యిల్లాలికి.

మగాళ్లమధ్యకి వెళ్లడం ఎందుకని ఓ కుర్రాడి చేతికి డబ్బు ఇచ్చి పంపింది.

* * *

ఆ రాత్రి భర్తతిని లేచిన తర్వాత సరోజిని ఫోం చేస్తూంటే 'ఇవెక్కడివో?' అంటూ సరోజిని కొన్న లేహ్యం, తలనూనెలు పట్టుకు వంటింటిదగ్గర కొచ్చాడు చంద్రయ్య.

'ఇవ్వాళ బజార్లో కొన్నానండి. మంచి గుణం యిస్తాయని సుబ్బమ్మగారు చెప్పింది.'

'భేష్. పేర్ల డాబుతో ప్రజలనేగాక, శబ్దాన్ని కూడా వర్తీ కొట్టించావన్నమాట! పిచ్చిసరోజినీ, దీన్లో సువర్ణం శుద్ధ శూన్యం. సరస్వతీ ఆకు కలిసింది. సరస్వతే కలిసింది కాబట్టి ఆమె వొంటిమీద ఎలాగూ, సరోజినిలాగాక, చిన్నమెత్తుబంగారం ఉండక పోదనే ధీమాతో దీనికి "సువర్ణమిశ్రమం"అని పేరిచ్చాను.' అని నవ్వసాగాడు చంద్రయ్య.

సరోజినికి ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. ఇందాకగుంపు మధ్య అంత చులకనయినకూడా భార్యాపిల్లల పోషణకని అన్ని తంటాలు పడినవ్యక్తి తనభర్త! ఆమె జాలికళ్లు అటు తిరిగి పైటకొంగుని ఆశ్రయించాయి.

'ఇంతకీ నీకివి కొనడానికి డబ్బెలా వచ్చిందో? జీతం ఋణదాతల పాలబడింది గదా?' అని అడిగి జవాబుకోసం చంద్రయ్య చాలాసేపు వేచివుండవలసి వచ్చింది.

గుచ్చిగుచ్చి అడిగినమీదట ఎలాగైతేనేం చెప్పింది సరోజిని: 'సుందరమ్మగారేమో సవరాలు చేసేవాళ్లు ఊడిపోయిన జుత్తుని కొనుక్కుంటారని—' భర్త కళ్లనుంచి తనవైపు దుముకుతున్న జాలి జలపాతం చూసి, ఆ వాక్యం పూర్తిచెయ్యడం అనవసరమని భావించింది. ★

# అంతస్థుల నాగరికత

(27-వ పేజీ తరువాయి)

గుండా ఆకాశంలోకి దీర్ఘంగా చూస్తున్నాడు.

"ఎక్కడికో చెప్పండి" కండక్టరు గట్టిగా అరిచాడు.

"రాణిగంజి ఇవతల స్టేజీకి...నాకు దాని పేరు తెలియదు" అన్నాడాయన తొణుకూ బెణుకూ లేకుండా, కండక్టరు సణుక్కుంటూ ముందుకు కదిలాడు.

ఇంకోకాయన పదిరూపాయల నోటిచ్చాడు. కండక్టరు దగ్గఱ చిల్లరలేదు. ఆయననూ, ఆయన తాలూకు సాహసాన్ని దుమ్మెత్తిపోశాడు. కండక్టరు. అతడు ఇంకెవ్వరితోనూ దెబ్బలాడటానికి వీలుచిక్కక కుడిచేయి గుప్పిటమూసి నుదుటికి చేర్చి "కట కటా...హా కటా" అంటూ నాటకంలోకి మళ్లే ఏకును ప్రారంభించాడు.

రెండుమూడు స్టేజీలు దాటాయి. రాణిగంజిలో బస్సుఆగింది. జనం కండక్టర్ని అనేకవిధాలుగా తిట్టి తిట్టి బస్సుదిగారు. ముసిలాయన వెనక్కు తిరిగితిరిగి తీక్షణంగా చూస్తూ వెళ్ళిపోయాడు. నేనూ బస్సు దిగాను. మళ్ళీ ఏదో మర్చిపోయినవాడిలా వెనక్కువెళ్ళి కండక్టర్ని నిమ్మపించి ఇలా అన్నాను:

"అబ్బాయీ! నిన్నొకప్రశ్న అడిగి సమాధానం తెలుసుకొంటేగాని నేను ఇంటికి కులాసాగా వెళ్ళలేను. నాకు రాత్రి నిద్ర పట్టదు. నువ్వు కోపగించుకోకుండా సమాధానం చెబుతావా?"

కండక్టరు కింత వినయం చూపించి మాట్లాడినవాడు అతని గతచరిత్రలో దొరకలేదో ఏమో అతడు కోపాన్ని దిగమ్రింగుకొని

"దానికేమిటి అడగండిబాబూ"అన్నాడు.

"నువ్వు కండక్టరు ఉద్యోగం ఎన్ని రోజులనుంచి చేస్తున్నావు?" అనడిగాను.

"మూడు నెలలనుంచి చేస్తున్నానండి"

"అంతకు పూర్వం ఏం చేసేవాడవు బాబూ?" అనడిగాను. అతడు కొంచెంసిగ్గుపడ్డాడు. కాని నేనుబుజ్జగించి అడగటంవల్ల సమాధానం చెప్పాడు.

"నాలుగు సంవత్సరాలు క్లీనరుగా పనిచేశానండి. మెల్లగాచదవటం, రాయటం నేర్చుకొన్నానండి. అందుకని నాకీఉద్యోగం ఇచ్చారండి!"

నేను బస్సుదిగి ఇంకా రెండడుగులైనా వెయ్యలేదు. మళ్ళీ ఏదో మర్చిపోయినట్టు వెనక్కువెళ్ళాను. అప్పటికే బస్సుకదిలింది. ఫుట్‌పాత్ మీద నిలబడ్డ ఆ కండక్టరు నన్ను పరీక్షచేస్తూనే వున్నాడు. నా ఆత్రుత తెలుసుకొన్నాడు. కదులుతున్న బస్సులో నుంచి "అప్పుడు నాటకంలో వేషాలుకూడా వేసేవాడ్ని"అని అతడు అరచినట్లయింది. సంతృప్తితో వెనక్కు తిరిగాను. హోటల్‌లో రేడియో మొరుగుతోంది. ప్రాచీన భారత నాగరికతనూ, ఆధునిక పాశ్చాత్య నాగరికతనూ పోల్చి చెబుతూ ఆయనెవరో గాలిని పాడుచేస్తున్నాడు! ★